www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 2 అక్టోబర్ 2023

5

తూర్పుగోదావరి



బాలయోగి స్ఫూర్తితో పనిచేద్దాం : గన్ని

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కార్యకర్త స్థాయి నుంచి లోక్‌సభ స్పీకర్‌గా ఎదిగినప్పటికి ఆయన కార్యకర్తల మనిషిగానే ఉన్నారని, పార్టీ పట్ల విధేయతకు ఆయన దిక్సూచి అని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కష్ణ అన్నారు. జిఎంసి బాలయోగి జయంతి వేడుకలను నగరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గన్ని కృష్ణ మాట్లాడుతూ పార్టీ అన్నా, కార్యకర్తల అన్నా ఆయనకు ఎంతో గౌరవమని, ఆయన ఏపదవి చేపట్టిన దానికి వన్నె తెచ్చారని అన్నారు. ఆయన బ్రతికి ఉంటే చంద్రబాబు అక్రమ అరెస్ట్ పట్ల ఎంతో బాధపడేవారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు యర్రా వేణుగోపాలరాయుడు, వాసిరెడ్డి రాంబాబు, వర్రే శ్రీనివాసరావు, మాజీ ఫ్లోర్ లిడర్ రాచపల్లి ప్రసాద్, రెడ్డి రాజు, మాలే విజయలక్ష్మి, సంసాని ప్రసాద్, బుడ్డిగ రాధా, మరుకుర్తి రవియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న డెంగీ

- జేబులు నింపుకుంటున్న ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు
- ప్లేట్ లెట్స్ సాకుతో రూ.వేలకు వేలు వసూళ్లు
- ఆందోళనలో రోగుల బంధువులు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాను డెంగీ జ్వరాలు ఒణికిస్తున్నాయి. దీంతో జిల్లాలోని కార్పొరేట్, ప్రయివేటు ఆసుపత్రులు జ్వరపీడుతులతో కిటకిటలాడుతున్నాయి. రోజు రోజుకీ జ్వర పీడుతుల సంఖ్య పెరుగుతుండటంతో ఇదే అదునుగా ఆయా కార్పొరేట్, ప్రయివేటు ఆసుపత్రి యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తూ తమ జేబులను నింపుకుంటున్నాయి.వాతావరణంలో వస్తున్న మార్పుల కుతోడు వర్షాకాలం వీడి శీతాకాలంలోకి ప్రవేశిస్తున్న తరుణంలో ఎక్కడ నీరు అక్కడే నిల్వ ఉండిపోవడంతో దోమలు, ఈగలు పెద్దఎత్తున పెరుగుతున్నాయి. దోమల ద్వారా వ్యాప్తించే డెంగీ జ్వరాలకుతోడు, ప్రస్తుతం రాత్రి వేళ చల్లటి వాతావరణం ఉండడంతో ప్రజలు శ్వాసకోశ వ్యాధులు, జలుబుతో ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా సాధారణ, వైరల్ జ్వరాలు ప్రజలను పట్టిపీడుస్తున్నాయి. ఇదే అవకాశంగా ప్రయివేటు ఆసుపత్రులకు, డయాగ్నస్టిక్ సెంటర్లకు రోగులు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి నెలకుంది. దీంతో ఎన్ఎస్-1 పరీక్ష నిర్వహించి పాజిటివ్ రాగానే డెంగీ జ్వరంగా నిర్ధారించేస్తున్నారు. కేవలం ఎన్ఎస్-1 పరీక్ష ద్వారా డెంగీ నిర్ధారణ చేయలేమని వైద్యఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రయివేటు, కార్పొరేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌ల నిర్వాహకులు మాత్రం డెంగీ కాకపోయినా అందుకు తగ్గట్టుగా చికిత్సలు చేస్తూ తమ జేబులను నింపుకుంటున్నారు. వైద్యం ముసుగులో వీరు చేస్తున్న దోపిడిపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించకపోవడం విశేషం. జిల్లాల్లో ఇప్పటి వరకు అధికారుల గణాంకాల ప్రకారం డెంగీ కేసులు జనవరి నుంచి 72, మలేరియా కేసులు 6 నమోదు అయ్యాయి. నిత్యం పదుల సంఖ్యలో పలు ఆసుపత్రుల్లో డెంగీ వ్యాధికి సంబంధించిన చికిత్సలను అందిస్తుండడం గమనార్హం. ఎవరైన జ్వరంతో ఆసుపత్రికి వస్తే అన్ని రకాల పరీక్షల పేరుతో, ఆసుపత్రిలో బెడ్డుకు ఛార్జీలకు, చికిత్స ప్రారంభించాక అయ్యే ఖర్చుకు హద్దే ఉండడం లేదని రోగులు బంధువులు వాపోతున్నారు.

జ్వరాలపై ప్రత్యేక కార్యచరణ

జిల్లాలో సీజనల్ వ్యాధులు, ముఖ్యంగా జ్వరాలు అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలలో సైతం వైద్యం అందుబాటులో ఉంది. రెండు రోజులకు మించి జ్వరం ఉంటే రోగులు తప్పనిసరిగా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలి. పరీక్షల అనంతరం డెంగీ అని గుర్తిస్తే వైద్యం అందిస్తున్నాము. ఫీవర్ సర్వే ద్వారా జ్వర పీడితులను గుర్తిస్తున్నాము. జనవరి నుంచి డెంగీ వ్యాధులు 72, మలేరియా 6 కేసులునమోదయ్యాయి.

- డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, డిఎంహెచ్ఒ తూర్పుగోదావరి జిల్లా

డెంగ్యూ సాకుతో పలు రకాల పరీక్షలు

జ్వరంతో రోగులు ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్తే డెంగీ వ్యాధిగా నిర్ధారించి చికిత్సను అందిస్తున్నారు. వైరల్ ఫివర్‌తో వచ్చిన రోగులకు డెంగీ చికిత్సనే అందిస్తున్నారు. ప్రజలకు డెంగీ వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడంతో ప్రయివేటు, కార్పొరేట్ ఆసుపత్రులు డయాగ్నస్టిక్ సెంటర్లతో కుమ్మక్కై, చిన్నపాటి జ్వరానికి సైతం రక్త పరీక్షలు చేయిస్తూ లేనిపోని రిపోర్టులను అందిస్తూ దోచినకాడికి దోచేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సాధారణ స్థాయిలో ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గినా డెంగీని బూచీగా చూపి రోగులతోపాటు, వారి బంధువులను ఆందోళనకు గురిచేస్తున్న ఉదంతాలు అనేకం. డెంగీ వ్యాధి అని నిర్ధారణ అయిన రోగులకు చికిత్స అందించి రెండు మూడు రోజుల ఐనా ప్లేట్‌లెట్స్ పెరగకపోతే పరిస్థితి విషమించిందనే సాకుతో విశాఖపట్నం, విజయవాడ వంటి ప్రాంతాలకు రోగులను తరలించేస్తున్నారనే అభియోగాలు ఉన్నాయి.

ప్లేట్‌లెట్స్ చూపించి దోపిడి

డెంగీ జ్వరం కారణంగా రక్తంలో ప్లేట్‌లెట్స్ ఎక్కువ సంఖ్యలో పడిపోవటం పరిపాటి. ఈ సమస్యను ప్రధానంగా చూపించి పలు ప్రయివేటు ఆసుపత్రులు దోచుకుంటున్నాయి. సాధారణంగా ప్లేట్‌లెట్స్ ఒక్క డెంగీ జ్వరంలోనే కాకుండా వైరల్ ఫీవర్స్, చికున్‌గున్యా, రక్త సంబంధిత సమస్యతోను తగ్గుతుంటాయని ఆయా రంగానికి చెందిన నిపుణులు చెబుతున్నారు. అయితే ప్లేట్‌లెట్స్ ఎప్పుడు తగ్గినా అంతప్రమాదకరం కావు. ప్రతీ వ్యక్తి శరీరంలో సాధారణంగా లక్ష నుంచి మూడున్నర లక్షల వరకు ప్లేట్‌లెట్స్ ఉంటాయి. ఆయా సమస్యలు వచ్చినప్పుడు వీటి సంఖ్య కొంత మేర తగ్గినప్పటికీ ప్రాణానికి హాని కలిగేంత స్థాయిలో తగ్గేందుకు అవకాశం ఉండదని పేర్కొంటున్నారు. డెంగీ వ్యాధి భారినపడిన వారిలో కూడా 10-20 వేలకు ప్లేట్‌లెట్స్ తగ్గినప్పుడు మాత్రమే ప్రమాదకరమని ప్రభుత్వ వైద్యులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ప్రైవేట్ ఆసుపత్రుల్లో జ్వరంతో వచ్చిన వెంటనే పరీక్షలు అంటూ అవసరమున్నా లేక పోయినా చికిత్సలు చేస్తున్నారు. ప్రయివేటు, కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీని ఆరోగ్యశాఖ అరికట్టాలని రోగులు వారి బంధువులు కోరుతున్నారు.

3 నుంచి ఎఫ్ఎ-2 పరీక్షలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ నెల మూడు నుంచి ఐదో తేదీ వరకు ఎఫ్ఎ-2 పరీక్షలు నిర్వహించనున్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్దేశించిన సిలబస్ మేరకు ఉమ్మడి ప్రశ్నపత్రాలతో పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్ష నిర్వహించే రోజున సంబంధిత ఉపాధ్యాయులకు వాట్సాప్ రూపంలో గంట ముందుగా ప్రశ్నపత్రాలు అందించనున్నారు. బ్లాక్ బోర్డుపై ప్రశ్నలను ఉపాధ్యాయులు రాసిన తర్వాత వీటి సమాధానాలను విద్యార్థులు రాయాల్సి ఉంటుంది. ఈ మేరకు జిల్లాలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లను పూర్తి చేశారు.

పరీక్షలు ఇలా..

3న 1 నుంచి 5 తరగతులకు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు తెలుగు, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు గణితం, 4న ఇంగ్లీషు, ఎన్విరాన్‌మెంట్ సైన్స్, 5న ఒఎస్ఎస్‌సి పరీక్షలు నిర్వహిస్తారు. 6 నుంచి 8 తరగతులకు 3వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.15 గంటల వరకు తెలుగు, 3.15 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గణితం, 4న హిందీ, జనరల్ సైన్స్, 5న ఇంగ్గిషు, సోషల్, 6న ఒఎస్ఎస్‌సి పరీక్షలు నిర్వహించనున్నారు. 9 , 10 తరగతుల విద్యార్థులకు 3న ఉదయం 9.30 గంటల నుంచి 10.15 గంటల వరకు తెలుగు, 11 గంటల నుంచి 11.45 గంటల వరకు గణితం, 4న హిందీ, జనరల్ సైన్స్, 5న ఇంగ్లీషు, సోషల్, 6న ఒఎస్ఎస్‌సి పరీక్షలు నిర్వహించాలని పాఠశాలలకు సమాచారం అందింది.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు

విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలల్లో ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు ఎఫ్ఎ-2 పరీక్షలు నిర్వహించనున్నాం. నిబంధనల మేరకు పరీక్షలు నిర్వహించాలని ఆదేశించాం. పరీక్ష నిర్వహించే సమయానికి గంట ముందు ప్రశ్నలను వాట్సాప్‌లో హెచ్ఎంలకు పంపిస్తాం. పాత పద్ధతిలోనే పరీక్షలు జరుగుతాయి.

అబ్రహం, డిఇఒ తూర్పుగోదావరి జిల్లా.

4న నిరుద్యోగ సమస్యపై సిపిఎం సదస్సు



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఈ నెల 4న సిపిఎం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న రాష్ట్ర నిరుద్యోగ సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు పిలుపు నిచ్చారు. స్థానిక శ్యామల సెంటర్లోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు, బి.రాజులోవ, ఎం. సుందరబాబు, ప్రసన్న కుమార్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను నిర్వీర్యం చేస్తున్నాయని, నిరుద్యోగం రోజురోజుకు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో గత 45 ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా నిరుద్యోగం పెరిగిందని నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం సిపిఎం శక్తివంచన లేకుండా పోరాడుతుందని, ఈ నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యంలో అక్టోబర్ 4న రాజమహేంద్రవరంలో విద్యావేత్తలు, మేధావులతో కలిసి యువత కోసం రాష్ట్ర సదస్సు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సదస్సులో యువతీ, యువకుల కోసం సిపిఎం ఒక ప్రత్యమ్నాయ విధానాన్ని ప్రకటించనుందని చెప్పారు. నాలుగున్నరేళ్లలో ఒక్క డిఎస్‌సిని కూడా తీయని రాష్ట్రంలో ఏదైనా ఉందంటే అది జగన్ ప్రభుత్వం మాత్రమేనని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంలో పూర్తిగా విఫలం అయ్యిందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో నిరుద్యోగం పై మరిన్ని పోరాటాలకు సన్నద్ధం కావాలని సిపిఎం ఈ సదస్సు నిర్వహిస్తుందని తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.రోజా ప్రవల్లిక అండర్ -14 విభాగంలో వాలీబాల్ పోటీలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం పి వీర్రాజు ఆదివారం తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన రోజాప్రవల్లికను పిఇటి ప్రేమ్‌చంద్‌లను పలువురు అభినందించారు.

అన్నదేవరపేటలో అన్నదానం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని అన్న దేవరపేట గ్రామంలో శ్రీ లక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన గణపతి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం అన్నదానం జరిగింది. ఈ ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన మూడు లడ్డూలను వేలంలో రూ.42 వేలకు భక్తులు సొంతం చేసుకున్నారు. అనంతరం ఈ లడ్డులను ఊరేగింపుగా గ్రామంలో ప్రదర్శించి పాట దారులకు అందజేశారు.

మూడు డాక్టరేట్‌లు సాధించడం రాష్ట్రానికే గర్వకారణం



డాక్టరేట్స్‌ను సత్కరిస్తున్న ఎంపి భరత్ రామ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఒకే కుటుంబంలో ముగ్గురు వ్యక్తులు ఒకే ఏడాది డాక్టరేట్‌లు సాధించడం అసాధరణమని, మూడు పిహెచ్‌డిలు సాధించిన ఆ కుటుంబం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే గర్వకారణమని ఎంపి మార్గాని భరత్ రామ్ అన్నారు. డాక్టర బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం గున్నెపల్లి గ్రామానికి చెందిన పాము ఆనంద్, పాము సత్యవరప్రసాద్, ఆయన భార్య పాము శాంతి కుటుంబం ఒకే ఏడాది ఆంధ్ర యూనివర్శిటీ నుంచి పిహెచ్‌డిలు సాధించిన సందర్భంగా ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ వేదిక కన్వీనర్, మాజీ కార్పొరేటర్, వైసిపి సీనియర్ నాయకులు అజ్జరపు వాసు సారథ్యంలో ఆదివారం నగరంలోని 48వ డివిజన్లోని మదర్ థెరిసా విగ్రహం వద్ద ఆ ముగ్గురు విజేతలకు ఆత్మీయ సత్కారం జరిగింది. అంబేద్కర్ సేవా కేంద్రం వ్యవస్థాపకులు డాక్టర్ గుబ్బల రాంబాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపి భరత్ రామ్, వైసిపి అర్బన్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. డాక్టరేట్ పట్టాలను సాధించిన పాము ఆనంద్, పాము సత్య వరప్రసాద్, పాము శాంతిలను వారు సత్కరించారు.

ఘనంగా ప్రపంచ వృద్ధుల దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా పలు సేవా సంస్థలు, రాజకీయ పార్టీలు పలు మండలాల్లో వృద్ధుల దినోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వృద్ధులను కన్న బిడ్డల మాదిరిగా చూసుకోవాల్సిన అవసరతను వెల్లడించారు. **రాజమహేంద్రవరం** లాలా చెరువులోని స్వర్ణాంధ్ర వద్ధాశ్రమ ప్రాంగణంలో జరిగిన ప్రపంచ వృద్ధుల దినోత్సవంలో సీనియర్ జడ్జ్, న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ కన్న తల్లిదండ్రులను ఆదరించడం ప్రతి ఒక్కరూ కనీస బాధ్యతగా తీసుకోవాలని, వృద్ధులు చివరి దశలో ఆనందంగా గడపాలనే లక్ష్యంతో ప్రభుత్వం పింఛన్‌ను ఇస్తుందన్నారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ వృద్ధులు, నిరాశ్రయుల కోసం చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. వృద్ధులు, వికలాంగుల సంక్షేమ శాఖ ఉపసంచాలకులు బి రామ్ కుమార్ మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అందిస్తుందన్నారు. స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు ఏర్పాటు చేసిన కాస్మోటిక్ పండ్లు చీరలు దుప్పట్లు 100 మంది వృద్ధులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సభ్యులు డాక్టర్ ఆనంద్, స్వర్ణాంధ్ర మేనేజర్ హరికష్ణ, ఇలియాస్, న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు పాల్గొన్నారు. **నిడదవోలు** స్థానిక బిసి కమ్యూనిటీ హాల్‌లో ప్రపంచ వద్దుల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ది సీనియర్ సిటిజెన్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు, మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్స్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని వృద్ధులను ఘనంగా సత్కరించారు. **తాళ్లపూడి** మండలంలోని ప్రక్కిలంక గ్రామ సచివాలయంలో ఆదివారం 80 సంవత్సరాలపైగా వయసు కలిగిన పలువురు వద్ధ ఓటర్లను ఘనంగా సన్మానించారు. ఎఎస్ఒ జోడాల వెంకటేశ్వరరావు, ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, వైసిపి నాయకులు యాళ్ల బాబురావు, తదితరులు పాల్గొన్నారు. **చాగల్లు** జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పిలుపునిచ్చారు. స్థానిక పంచాయితీ కార్యాలయంలో 103 సంవత్సరాలు నిండిన దాసరి పద్మావతి, అలాగే 85 ఏళ్లు నిండిన 14 మంది వృద్ధులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎస్. మల్లిబాబు, తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి, ఎంపిడిఒ బి.రాంప్రసాద్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** చివటం గ్రామానికి చెందిన 80 నుంచి 90 సంవత్సరాల వయసు గల ఓటర్లకు సచివాలయ ఆవరణలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె కష్ణవేణి, విఆర్ఒ ఎ.రాజశేఖర్, వెల్ఫేర్ అసిస్టెంట్ కొల్లి నాగవంశీ, మహిళా పోలీస్ మేరీ కుమారి, సన్మాన గ్రహీతలు పాల్గొన్నారు.



వృద్ధులకు స్వీట్లు తినిపిస్తున్న న్యాయమూర్తి ప్రత్యూషకుమారి

విద్యార్థినికి రూ. 45వేల సాయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని అన్నదేవరపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ఉత్తమ ర్యాంకు సాధించి ఇంటర్ చదువుతున్న విద్యార్థిని కవులూరి సుజిత అనారోగ్యం భారిన పడింది. ప్రస్తుతానికి ఆ విద్యార్థిని రాజమహేంద్రవరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ సమాచారాన్ని తెలుసుకున్న అరుంధతి నగర్ ప్రజలు రూ.25 వేలు, వైసిపి నాయకులు పోసిన శ్రీకష్ణదేవరాయలు కుమారుడు నాగార్జున రూ.15వేలు, వైసిపి నాయకుడు పప్పోప్పుల నాని రూ.5 వేలు మొత్తం రూ.45 వేలను బాధితురాలు కుటుంబానికి అందించారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ధవలేశ్వరం గ్రామానికి చెందిన బొడ్డు. వీరస్వామి అనే పింఛన్ లబ్ధిదారుడు అనారోగ్యంతో కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ సమాచారం తెలుసుకున్న వార్డు వాలంటీర్ ఐనం.మణికంఠ తన సొంత ఖర్చులతో కాకినాడ వెళ్లి ఆ లబ్ధిదారుడికి పింఛన్ సొమ్మును అందించాడు. ఈ సందర్భంగా మణికంఠను పంచాయితీ ఇఒ సూరిబాబు అభినందించారు.

కస్తూర్బాలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక కస్తూర్బా ఆశ్రమంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 80 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో డాక్టర్ క్రొవ్విడి రాజేష్, డాక్టర్ సత్యం రమేష్ బాబు, ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, క్రొవ్విడి నరసింహారావు, వై మధుసూదనరావు, మద్దుల ప్రభాకర్ రావు, శేఖర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బాబుకు మద్దతుగా రిలే దీక్ష

ప్రజాశక్తి - కడియం

టిడిపి అధినేత చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా ఆదివారం మురమండ గ్రామంలో టిడిపి నేత ప్రత్తిపాటి రామారావు చౌదరి ఆధ్వర్యంలో రిలే నిరహారదీక్ష జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. ఎంపిపి వెలుగు బంటి వెంకట సత్యప్రసాద్, మాధవరాయుడు పాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రత్తిపాటి సూర్యకుమారి, దేవళ్ళ రామ్మోహన్ రావు, గద్దే శ్రీధర్, ముత్యాల చినబాబు, పోతుల గిరి, పోతుల వీర్రాజు, గుణ్ణం శ్రీనివాస బ్రహ్మాజీ, వట్టికూటి రామారావు, ప్రత్తిపాటి వెంకట్రామయ్య చౌదరి, దేవళ్ల సత్తిబాబు, మేకా రామారావు, షేక్ వల్లీ, మిద్దే గోపీగౌడ్ పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు 'మోస్ట్ ప్రెస్టీజియస్ నర్సరీ' అవార్డు

ప్రజాశక్తి - కడియం

మండలంలోని మాధవ రాయుడుపాలెం గ్రామానికి చెందిన జనక మునేశ్వర నర్సరీ అధినేత గొల్లపల్లి వెంకటేశ్వరరావు (మునియ్య గారి శ్రీను)కు "ది టైమ్స్ గ్రూప్" సంస్థ 2023 సంవత్సరానికి గాను 'మోస్ట్ ప్రెస్టీజియస్ నర్సరీ" అవార్డు ప్రకటించింది. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సంస్థ అధినేత శరత్ కుమార్ అధ్యక్షతన అవార్డుల ప్రధానోత్సవంలో ప్రముఖ సినీతార మెహరిన్ చేతులమీదుగా ఈ అవార్డును వెంకటేశ్వరరావు అందుకున్నారు. పురష్కార గ్రహీతను ఎంపిపి వి.వెంకట సత్య ప్రసాద్, సర్పంచ్ అన్నందేవుల చంటి, అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.పోలరాజు, నర్సరీ రైతులు అభినందించారు.



అవార్డును అందుకుంటున్న వెంకటేశ్వరరావు

'అధికారంలోకి రావడమే లక్ష్యం'

ప్రజాశక్తి - గోపాలపురం

రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన పార్టీలను అధికారంలోకి తీసుకొచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు పిలుపునిచ్చారు. మండల స్థాయి విస్త్రత స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని కోరారు. టిడిపి, జనసేన పార్టీల ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సైకో జగన్ జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పోసిన గణపతి, గద్దెడ సత్యనారాయణ, రామలీల, తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - యంత్రాంగం

స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పలు గ్రామాల్లో ఆదివారం పరిశుభ్రత పరిరక్షణ కార్యక్రమాలు జరిగాయి. ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం ఈ కార్యక్రమాల్లో పాల్గొని శ్రమదానం చేశారు. చీపుర్లు పట్టి రోడ్లను ఊడ్చారు. పారలతో డ్రైన్లలో పూడికను తీశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే ప్రజల ఆరోగ్యం మెరుగుతుందని పిలుపునిచ్చారు. **రాజమహేంద్రవరం** స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ఇన్‌ఛార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పిఆర్ రాజీవ్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛాతా హీ సేవా' కార్యక్రమం జరిగింది. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతుగా శ్రమదానం కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా భాగస్వామ్యం అవ్వాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయ మూర్తులు ఎం.మాధురి, ఎం. నాగేశ్వర రావు, యుయు.ప్రసాద్, కె. ప్రత్యూష కుమారి, పలువురు న్యాయమూర్తులు, న్యాయ వాదులు, కోర్టు సిబ్బంది, పేరా లీగల్ వాలంటీర్లు, ఆర్ఎంసి శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు. **రాజానగరం** ఆటో నగర్ సమీపంలోని పుష్కర వనంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత, ఎంఎల్ఎ జక్కంపూడి రాజా, డిపిఒ .జెవి సత్యనారాయణ, ఎల్‌డిఎండి వి ప్రసాద్ తదితరులు శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అలాగే నన్నయ యూనివర్శిటీలో విసి పద్మరాజు సారథ్యంలో పరిశుభ్రత కార్యాక్రమాన్ని నిర్వహించారు. విసి పద్మరాజు చీపురు పట్టి అపారిశుధ్యంతో ఉన్న ప్రాంగణాన్ని తుడిచి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. **దేవరపల్లి** మండల కేంద్రంలో ఎంఎల్ఎ తలారి వెంకట్రావు పాల్గొని రోడ్డును శుభ్రం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.వి.కె దుర్గారావు, కార్యదర్శి ఎన్.రవికిషోర్, తదితరులు పాల్గొన్నారు. **చాగల్లు** పంచాయితీ పరిసర ప్రాంతాలను సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి ఆధ్వర్యంలో సిబ్బంది, ఇతర ప్రజాప్రతినిధులు శుభ్రం చేశారు. నిత్య జీవనంలో పరిసరాల పరిశుభ్రతకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్, వార్డు సభ్యులు, ఎంపిటిసి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. **కడియం**. సూర్యారావు పేటలోని వేపచెట్టు సెంటర్ వద్ద గల పరిసరాలను శుభ్రంగా చేసి, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. వైసిపి మండల అధ్యక్షుడు స్టాలిన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఆకుల సుధాకర్, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మోరంపూడి, బొమ్మూరు, వేమగిరి, కడియపులంక, జొన్నాడ 216(ఏ) జాతీయ రహదారికి ఇరువైపులా శ్రమదానం కార్యక్రమం జరిగింది. జాతీయ రహదారుల హైవే టెక్ మేనేజర్ సల్మాన్ అన్సారీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ఈ కష్ణారావు, టెక్నికల్ ఇంజనీర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు. **గోకవరం** మండలంలోని రంపఎర్రంపాలెం గ్రామంలో సిడిపిఓ ఝాన్సీ రాణి ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పి.రాంబాబు, సర్పంచ్ బాదంపూడి హర్షిత పాల్గొన్నారు. **గోపాలపురం** పొగాకు బోర్డు అధికారులు, సిబ్బంది, రైతులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ఎం. ఆదిశేషయ్య మాట్లాడారు. ప్రతి ఒక్కరు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర, దేశ అభివద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం అవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఒ అమూల్ డి శ్యామ్, ఎస్‌జిఒ హేమస్మిత, రైతులు కూసం రామ్మోహన్ రెడ్డి, ఇల్లూరి రాంబాబు, బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సచివాలయ సిబ్బంది చెత్త నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఉండ్రాజవరం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిడిఒ జివిఎస్‌కె రాజు పాల్గొన్నారు. గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్యశాఖ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



దేవరపల్లిలో పరిశుభ్రత కార్యక్రమంలో ఎంఎల్ఎ తలారి వెంకట్రావు



రాజానగరంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత , ఎంఎల్ఎ జక్కంపూడి



రాజమహేంద్రవరంలో పరిశుభ్రత కార్యక్రమంలో న్యాయమూర్తులు

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

కాల్వలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కాలువలో స్నానం చేస్తూ ప్రమాదవశాస్తు మునిగిపోయి ఒక వ్యక్తి చనిపోయిన సంఘటన మండలంలోని అంకంపాలెంలో చోటు చేసుకుంది పోలీసు వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన కరుటూరి శ్రీరామ ప్రసాద్ (40) ఆదివారం ఉదయం గ్రామ శివారులో ఉన్న శివాలయాన్ని దర్శించుకునేందుకు వెళ్లాడు పక్కనే ఉన్న కాలువలోకి స్నానానికి దిగాడు ప్రమాదవశాస్తు మునిగి పోయి మృతి చెందాడు దీనిపై, భార్య వెంకట దుర్గ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు.

పురుగు మందు తాగిన బాలుడు మృతి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

తండ్రి మందలించడంతో, మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందిన సంఘటన రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన సాధనాల గోవింద్ (15) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. వెంటనే అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గోదావరిపై ఉన్న గ్యామన్ ఇండియా బ్రిడ్జిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందారు. ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలు.. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం అర్తమూరుకు చెందిన నిడదవోలు రమణ తన భార్య వీరలక్ష్మి (32), కుమారుడు వెంకట్‌తో కలిసి బైక్‌పై దేవరపల్లి మండలం గౌరీపట్నం బయల్దేరారు. వీరి బైక్‌ను ఓవర్ టేక్ చేయబోయిన లారీ ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో వీరలక్ష్మి అక్కడికక్కడే మతి చెందింది. కుమారుడు వెంకట్‌కు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న ఎంపి మార్గాని భరత్ రామ్ ఆగి అంబులెన్స్‌కు ఫోన్ చేసి హుటాహుటీనా ఆసుపత్రికి తరలించారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - తాళ్లరేవు

కోరంగి వంతెన సమీపంలో జాతీయ రహదారి 216పై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు కోరంగి పంచాయతీ బొడ్డు చినవెంకటాయపాలెం గ్రామానికి చెందిన పాలెపు సత్తిబాబు (32) కాకినాడ నుంచి బైకుపై వస్తుండగా యానాం వైపు నుంచి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఎస్ఐ పి.శ్రీనివాస్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరం

డిఎం అండ్ హెచ్ఒ నరసింహ నాయక్



ముఖాముఖి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

వర్షాకాలం వాతావరణంలో మార్పులు, పరిసరాల అపరిశుభ్రత వంటి కారణాలతో వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య నిపుణులను సంప్రదించి మెరుగైన వైద్య చికిత్స పొందడం వల్ల ప్రాణాపాయం తప్పుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నరసింహ నాయక్ పేర్కొన్నారు. కాలానుగుణ వ్యాధుల నివారణ, చికిత్సలపై ఆయన వివరించారు.

జిల్లాల్లో వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయి. 140 పైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు చర్యలు తీసుకుంటాం. ముందుగా గ్రామంలోని ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలను సంప్రదిస్తే ప్రాథమిక చికిత్స అందిస్తారు. ఆరోగ్య ఉపకేంద్రాలకు వెళితే వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. కలుషితమైన నీరు లేదా ఆహారం తీసుకోవడం వల్ల ఇలాంటి అనారోగ్య సమస్యలు వస్తాయి. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. నీరసంగా ఉంటే అవసరమైతే ఆసుపత్రిలో జాయిన్ చేసుకొని మెరుగైన వైద్య అందిస్తారు.

మలేరియా, టైఫాయిడ్ నిర్ధారణకు పరీక్షలు ఎక్కడ చేస్తారు. ఫలితాలు ఎప్పుడు వస్తాయి.

గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో ప్రాథమికంగా జ్వరాలకు మందులు ఉచితంగా ఇస్తారు. జ్వరం తగ్గనట్లయితే లక్షణాల మేరకు మలేరియా సంబంధించి రెండు రకాల పరీక్షలు ఉంటాయి. మొదటగా ఆర్‌టిపిసిఆర్ చేసి వెంటనే చెబుతారు. అనుమానముంటే రక్తనమూనా సేకరించి ల్యాబ్‌కు పంపిస్తారు. టైఫాయిడ్ నిర్ధారణకు కూడా రక్త నమూనాలను సేకరించి జిల్లా కేంద్రంలోని సెంట్రల్ డయాగ్నస్టిక్ సెంటర్‌కు పంపిస్తారు. మరుసటి రోజే ఫలితం వస్తుంది. రోగి చరవాణికి కూడా సమాచారం వస్తుంది.

రెండుసార్లు కరోనా పాజిటివ్ వచ్చినా మరోసారి వస్తే ఏమైనా ప్రమాదం ఉంటుందా.

రెండుసార్లు పాజిటివ్ వచ్చినా వారిలో ఉన్న రోగ నిరోధక శక్తిని బట్టి కొందరు ఆరోగ్యంగా ఉంటారు. మరికొందరు బలహీనంగా కనిపిస్తారు. పౌష్టికాహారం, పండ్లు తీసుకోవాలి. అజాగ్రత్తగా ఉంటే కరోనా పలుమార్లు రావచ్చు. ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. వైద్యులను సంప్రదించడంతో పాటు తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.

జ్వరం వచ్చి నీరసంగా ఉన్నా.. ప్లేట్ లెట్లు తక్కువగా ఉన్నా..ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్స చేస్తారా

ప్లేట్లెట్స్ తక్కువగా ఉన్నాయని భయాందోళన వద్దు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరితే చికిత్స ప్రారంభిస్తారు. అన్ని రకాల వ్యాధులకు మెరుగైన చికిత్స అందిస్తున్నాం.

కాలానుగుణ వ్యాధుల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు కుట్టకుండా జాగ్రత్త పడాలి. నిరుపయోగంగా ఉన్న కుండీలు, టైర్లు, ప్లాస్టిక్ డబ్బాల్లో నీరు నిలువకుండా చూడాలి. దోమలు నిర్మూలించే చర్యలు తీసుకోవాలి.

చిన్న పిల్లల విష్యంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు ఏమిటి

వర్షాలు ఎక్కువగా పడుతున్నందున చిన్న పిల్లల రోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వేడి చేసి చల్లార్చిన నీటినే తాగించాలి. వాంతులు, విరేచనాలు అయితే పిల్లలు నీరసపడకుండా చూసుకోవాలి. రెండు, మూడు రోజుల్లో జ్వరం, జలుబు తగ్గకపోతే డాక్టర్ దగ్గరికి వెళ్లాలి.

తెలుగు రాష్ట్రాల నాటక పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

పంతం పద్మనాభం స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు జరిగే 22వ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక పోటీలు ఆదివారం సూర్యకళామందిరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత నీలకంఠ నృత్యనికేతన్ కాకినాడ వారి ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు జరిగాయి. అనంతరం రాత్రి ఆకాశం శ్రీరామచంద్రమూర్తి కళాప్రాంగణాన్ని డాక్టర్ చెలికాని స్టాలిన్ ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి బుర్రా పద్మనాభం అధ్యక్షతన జరిగిన సభలో సంస్థ అధ్యక్షుడు, మాజీ కేంద్ర మంత్రి ఎంఎం.పళ్లంరాజు, ఉపాధ్యక్షుడు వి.సత్యనారాయణరెడ్డి, రాయప్రోలు భగవాన్, పంతం గాంధీమోహన్, పంతం నెహ్రూ, మార్ని జానకిరామ్ చౌదరి, బోణం వెంకట భాస్కర్, సరస్వతి గానసభ కార్యదర్శి పేపకాయల రామకృష్ణ, పంతం పద్మనాభం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుర్రా పద్మనాభం మాట్లాడుతూ పంతం పద్మనాభం ప్రోత్సాహంతో ఆయన సాధనకోసం సంస్థను ప్రారంభించి, గత 24 సంవత్సరాలుగా నిర్విరామంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో కళాకారులు, రంగస్థల కళారంగాన్ని ప్రోత్సహించడమే తమ ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పంతం పద్మనాభం గ్రామాల్లో కళాకారులను ప్రోత్సహించి, ఎంతగానో ఆదరించేవారన్నారు. ఆయన స్ఫూర్తిని బుర్రా పద్మనాభం కొనసాగించడం ఎంతో అభినందనీయమన్నారు.



మాట్లాడుతున్న పళ్లం రాజు

క్లాప్ మిత్రలకు కలెక్టర్, ఎంపీ సత్కారం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పరిశుభ్రవంతమైన సమాజం కోసం ఆరోగ్యవంతమైన జీవితం కోసం స్వచ్ఛత ఈ సేవ శ్రమదానం ప్రతి ఒక్కరూ ఉద్యమంలో చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, కాకినాడ ఎంపీ వంగా గీత పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ పిలుపు మేరకు స్వచ్ఛతాహి సేవ శ్రమదానం, క్లాప్ మిత్రలకు సత్కారం, క్లాప్ మిత్రలతో తేనీ టి విందు వంటి కార్యక్రమాల్లో కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, ఎంపీ వంగా గీత, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తదితరులు అచ్చంపేట గ్రామ పంచాయితీలో ఆదివారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం చేపట్టారు. అనంతరం క్లాప్ మిత్రలకు సన్మానం చేసి, కాఫీ విత్ క్లాప్ మిత్రా, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ రమణారెడ్డి, డిఎల్‌డిఒ పి.నారాయణ మూర్తి, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఒ డి.శ్రీలలిత, ఇఒపిఆర్‌డి కె.హరికృష్ణ సత్యారెడ్డి పాల్గొన్నారు.


క్లాప్ మిత్రలతో తేనీరు స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

జోరుగా అన్నదానాలు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

వినాయక చవితి నవ రాత్రుల ముగింపును పురస్కరించుకుని ఆదివారం జోరుగా అన్నదానాలు నిర్వహించారు. తొలుత సామర్లకోట మండలం హుస్సేన్‌పురంలో భారీ అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాదాన్ని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్, టిడిపి నాయకులు గుమ్మళ్ల రామకృష్ణ, చల్లా బుజ్జి ప్రారంభించారు. సుమారు 1000 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. గణేష్ కాలనీలో కౌన్సిలర్ మర్రి శేషారావు, పాలిక చంటిబాబు ఆధ్వర్యంలో 500 మందికి భోజనాలు అందజేశారు.

యానాం వార్తలు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జయప్రకాష్ నారాయణ, లక్ష్మీనారాయణ

ఘనంగా ఓల్డేజ్ హోమ్ రజతోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో యానాం వద్ధాశ్రమ 25 వసంతాల వేడుక ఘనంగా నిర్వహించారు. యానాం వద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లాడి కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా లోక్ సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ, సిబిఐ మాజీ డైరెక్టర్ జెడి.లక్ష్మీనారాయణ, న్యూఢిల్లీ ప్రిన్సిపల్ సెక్రెటరీ అన్బురసు, వైజాగ్ ప్రొఫైల్ చైర్మన్ ఇ.శంకర్రావు హాజరయ్యారు. యానాం వద్ధాశ్రమాన్ని సందర్శించిన వీరు పలు నూతన వాహనాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వృద్ధులతో మాట్లాడారు. అనంతరం అగ్నికుల క్షత్రియ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య అతిథులు మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను వృద్ధాశ్రమ నిర్వహణ కమిటీ ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో పెసల గిడ్ల చంద్రావు, పెండెం సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న అధికారులు

ఘనంగా జిఎంసి బాలయోగి జయంతి

ప్రజాశక్తి - యానాం

యానాం సమాచార శాఖ ఆధ్వర్యంలో జిఎంసి బాలయోగి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పరిపాలన అధికారి కార్యాలయం సమీపంలో ఉన్న బాలయోగి విగ్రహానికి సిఐ షణ్ముగం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి గణేషన్, సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీనివాస్, చెక్కల అరుణ్ కుమార్, కెఎల్‌వి.ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరం రూరల్, కాతేరు గ్రామానికి చెందిన శీలం నాగేశ్వరరావు గారి కుమారుడు శీలం వీర వెంకట సత్యనారాయణకు చెందిన సర్వే నెంబరు 19-2లో గల 226.89 చ॥గ॥ డాబా ఇల్లుకు సంబంధించిన 1917/2001 నెంబర్ గల ఒరిజినల్ లింక్ దస్తావేజులు మండల కేంద్రమైన కడియం సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న జిరాక్స్ సెంటర్ నుండి కడియం క్యాథలిక్ సిరియన్ బ్యాంక్ మార్గ మధ్యములో పడిపోయినవి. దస్తావేజులు దొరికిన వారు క్రింది చిరునామాకు సంప్రదించాలని కోరుతున్నాము.

శీలం వీర వెంకట సత్యనారాయణ
సాయిబాబా గుడి వద్ద, కాతేరు,
రాజమహేంద్రవరం రూరల్, తూ॥గో॥జిల్లా.
సెల్: 95156 48878

సిపిఎంపై సజ్జల వ్యాఖ్యలు సరికావు

ప్రజాశక్తి-పిఠాపురం

సిపిఎం, కమ్యూనిస్టులపై ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికావని సిపిఎం నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక నందూరి ప్రసాదరావు కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టులు సిద్ధాంతపరంగా పనిచేస్తారు తప్ప ఎవరికీ తాబేదారులుగా పని చేయరని హితవు పలికారు. కమ్యూనిస్టు భావజాల కుటుంబం నుంచి వచ్చి ఉన్నతమైన పదవిలో ఉన్న సజ్జలకమ్యూనిస్టు సిద్ధాంతాలు పూర్తిగా తెలుసుకొని మాట్లాడాలి తప్ప ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కన్వీనర్ కుంచే చిన్న, కోనేటి రాజు, కరణం విశ్వనాథం, కె.నాగేశ్వరరావు ఉన్నారు.

రోటరీ సహకారంతో వైద్య శిబిరం

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం రోటరీ క్లబ్ అధ్యక్షులు యడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉచితంగా మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద మెడికవర్ హాస్పటల్ సహకారంతో ప్రాజెక్ట్ ఆన్‌పాజిటివ్ హెల్త్ ద్వారా రోగులకు వైద్య నిపుణులు వంశీకృష్ణ, రాజేష్ బిపి, సుగర్, వయసును బట్టి బరువు, ఎత్తు గుండెకి సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు కొండా వేణుగోపాల్‌రావు, అరగల తాతయ్య, జి.వెంకట్, డాక్టర్ శ్రీకాంత్, కేశవరాజు, డి.శంకర్, బి.భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా వృద్ధుల దినోత్సవం

ప్రజాశక్తి - ఆలమూరు

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాలలో బూత్ లెవల్ అధికారులు ఆధ్వర్యంలో 80 ఏళ్ల వద్ధులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆలమూరులో పంచాయతీ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఐపి.శెట్టి సమక్షంలో, జొన్నాడలో సర్పంచ్ కట్టా శ్రీనివాస్, పెదపళ్లలో సొసైటీ చైర్మన్ నెక్కంటి బుజ్జి సమక్షంలోనూ వృద్ధులను సత్కరించారు. పూలమాలతో ఘనంగా సన్మానించి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు నాతి కుమార్‌రాజా, మెహర్ ప్రసాద్, లోవ సత్యనారాయణ, విఆర్‌ఒలు, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - పెద్దాపురం

పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షునిగా వేముల అర్జున్ రావు, ఉపాధ్యక్షునిగా గుండేపల్లి బాబూరావు, ప్రధాన కార్యదర్శిగా కడకుదిటి వెంకట శివ సుధాకర్, సహాయ కార్యదర్శిగా ధవళేశ్వరపు సత్తిబాబు, కోశాధికారిగా ముందూరు వెంకట్రావు, ప్రమాణ స్వీకారం చేశారు. తాళాబత్తుల సాయి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిఐటియు నాయకులు డి.క్రాంతి కుమార్, గడిగట్ల సత్తిబాబు, ఎన్.సూరిబాబు, కోరుకొండ వరహాలరావు, సింహాద్రి కామేశ్వరరావు, కోరుకొండ విజయ్, టి.రాజా, చిట్టిమోజు శ్రీను, లక్ష్మీనారాయణ, కింతాడ శ్రీను, ప్రశాంత్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం రహిత సమాజం కోసం ర్యాలీ

ప్రజాశక్తి-పిఠాపురం

గోకివాడలో ఆదివారం గాంధీ జయంతిని పురస్కరించుకుని మద్యపానరహిత సమాజంగా తీర్చిదిద్దాలని మహిళలు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మద్యం వద్దు ఆరోగ్యం ముద్దు అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ మద్యం వల్ల అనేక కుటుంబాలు చిన్నాభిన్నం అయిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ జయంతి ఒక రోజుకే మద్యం షాపులు బంద్ చేసి మిగతా రోజుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరపడంతో అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మద్యం మహమ్మారిని పూర్తిగా నిషేధించినప్పుడే జాతిపితకు నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో మద్యపాన వ్యతిరేక పోరాట నాయకులు వల్లూరి పద్మ, వేమగిరి తలుపులియ్య, వేమగిరి, మరియమ్మ, గౌరి, వెంకటలక్ష్మి, చిన్నారి, భవాని పాల్గొన్నారు.


మద్యానికి వ్యతిరేకంగా నినదిస్తున్న మహిళలు

జిఎంసి బాలయోగికి ఘన నివాళి

ప్రజాశక్తి - తాళ్లరేవు

కోనసీమతో పాటు జిల్లా అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మాజీ పార్లమెంట్ స్పీకర్ జిఎంసి బాలయోగి సేవలు ఆదర్శనీయమని పలువురు తెలుగుదేశం నేతలు అన్నారు. బాలయోగి 72వ జయంతి సందర్భంగా తాళ్లరేవు, నీలపల్లి, యానాం వారధి వద్ద బాలయోగి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా తాళ్లరేవు అంబేద్కర్ భవనం వద్ద బాలయోగి విగ్రహానికి టిడిపి నాయకులు జక్కల ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యకర్తలు నివాళులర్పించారు. నీలపల్లిలో చిట్టూరి కలికి మూర్తి, యానాం వారధి వద్ద ఉన్న బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాట్ల పృథ్వి, ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి వెంకటరమణ, టేకుమూడి లక్ష్మణరావు, జక్కల ప్రసాద్ బాబు, మోపూరి వెంకటేశ్వరరావు, పొన్నమండ రామలక్ష్మి, గంజా సూరిబాబు, గంట గోపి, వస్కా రెడ్డి, వెంటపల్లి చంద్రమౌళి, వాసంశెట్టి శ్రీనివాస్, రోళ్ల చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.


తాళ్లరేవులో నివాళులర్పిస్తున్న నాయకులు

దిగిరాని అల్లం ధర.. కేజీ రూ.150

మండపేట : నెలలు గడుస్తున్న అల్లం ధర కిందకు దిగి రావడం లేదు. హోల్ సేల్ మార్కెట్లో కేజీ రూ.120 కాగా రిటైల్ మార్కెట్‌లో కేజీ రూ.150కి పైగా పలుకుతోంది. ప్రధానంగా ప్రజల అవసరాల మేరకు స్థానికంగా అల్లం అందుబాటులో లేదు. దీంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో అల్లం ధర అధికంగా ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రధాన మార్కెట్లో కేజీ రూ.150 నుంచి రూ.160 పలుకుతోంది.

ఇండోర్ గేమ్స్‌పై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఇండోర్ గేమ్స్, కథలు చదవడం, సమీక్షలు చేయడం వంటి కార్యక్రమాలపై బాలలకు ఆదివారం మాధవపట్నంలోని జమునానగర్ కాలనీ బాల మందిరంలో నిర్వహించారు. బాల మందిరం వ్యస్థాపకులు అంగర గోపాలకృష్ణ అధ్యక్షతన మెంటార్ హేమంత్ విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించగా, కాప్స్ టీచర్ వీరబాబు విద్యార్థులకు చిత్రలేఖనం, ఒరిగామి అంశాలపై తరగుతులు నిర్వహించారు. దసరా సందర్భంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకులు కృష్ణశ్రీ తెలిపారు. ఈ నెల 14, 15 తేదీలు విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, మ్యూజికల్ చైర్స్, రన్నింగ్, చెస్ విభాగాల్లో ఈ ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు.

పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - అంబాజీపేట

సంక్షేమ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రు బిసి హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన దుప్పట్లను ఆదివారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం హాస్టల్ వసతులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడి హాస్టల్‌లో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కాంద్రేగల శ్రీనివాసరావు, పేరి శ్రీను, పంచాయతీ కార్యదర్శి ఎన్.సత్యవేణి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జూనియర్ అథ్లెటిక్స్‌లో ఆదిత్య విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగానికి చెందిన ఫైనల్ ఇయర్ విద్యార్థి కె.దుర్గాప్రసాద్ జూనియర్ అథ్లెటిక్స్‌లో ఉత్తమ ప్రతిభ చూపాడు. ఇటీవల ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరు ఆధ్వర్యంలో ఐజిఎంసి స్టేడియం విజయవాడలో నిర్వహించిన 36వ ఎపి రాష్ట్ర స్థాయి అండర్-23 జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో 400 మీటర్ల రన్నింగ్ రిలేలో సిల్వర్ మెడల్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. దుర్గాప్రసాద్‌ను ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధిపతి జి.ప్రతాప్ రెడ్డి, కోచ్ వి.అఖిల్ అభినందించారు.

సర్పంచ్ సూరిబాబు ఆధ్వర్యంలో రక్తదానం

ప్రజాశక్తి - తాళ్లరేవు

రక్తదానంతో ఎంతోమంది ప్రాణాలను కాపాడ గలమని జి.వేమవరం సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు అన్నారు. జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా జి.వేమవరంలో పుణ్యమంతుల సత్తిబాబు ఆర్థిక సహకారంతో సర్పంచ్ సూరిబాబు, కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువకుల శిబిరానికి చేరుకుని ఉత్సాహంగా రక్తదానం చేశారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు జరిగే సమయంలో రక్తం ఎంతో అవసరం ఉందని కాకినాడ ప్రభుత్వాసుపత్రి మెడికల్ ఆఫీసర్ శ్రీహరిబాబు తెలిపారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన యువకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో చేయూత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి చింతా నారాయణమూర్తి, స్థానిక యువకులు, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులు, సర్పంచ్ సూరిబాబు